క్లుప్తంగా

భగవద్గీత కంఠస్థ పోటీల విజేతలు వీరే



భగవద్గీత కంఠస్థ పోటీల విజేతలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల, తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పోటీలు స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలపై నిర్వహించిన ఈ పోటీల జూనియర్స్ విభాగంలో దేవరగుంటకు చెందిన పి.మనూజ ప్రథమ, సీనియర్స్ విభాగంలో లక్కవరానికి చెందిన వి.సుధా కుమారి ప్రథమ, దేవరగుంటకు చెందిన పి.అరుణ కుమారి ద్వితీయ, ఏలూరుకు చెందిన డి.రమాదేవి తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పోటీల న్యాయనిర్ణేతలు ఎంవీఎస్ సత్యనారాయణ, ఎన్ సత్యనారాయణ, డి.పుష్పభాను బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

సామాజిక ఉద్యమం నిర్మించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో కలిసి సామాజిక ఉద్యమం నిర్మించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక చలసాని గార్డెన్‌లో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఏపీ యూటీఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను శనివారం లక్ష్మణరావు ప్రారంభించారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి, ఏలూరు జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్ లింగరాజు, డీఈఓ పి.శ్యామ్‌సుందర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస్, కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అవినీతికి వ్యతిరేకంగా నిరసన

ఏలూరు (టూటౌన్): జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ లిక్కర్ మాఫియా కింగ్ ధీరజ్ అవినీతికి వ్యతిరేకంగా స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్ములో ప్రతి పైసా తిరిగి వారికి ఇచ్చి తీరాలని నాయకులు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు నడపన దానభాస్కరరావు, గాది రాంబాబు, ప్రక్కి మహేంద్ర, గుమ్మడి చైతన్య, ఇలపకుర్తి కుసుమ కుమారి, గండికోటరాణి, నాగం శివ, బాడిత నారాయణ, ఐ.రాజశేఖర్ పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళల ఆర్థికాభివృద్ధి

ఏలూరు నియోజకవర్గంలో 32,672 మందికి రూ.74.82 కోట్ల లబ్ధి

ఏలూరు (టూటౌన్): మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేసేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుచేస్తోంది. ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ, అమ్మఒడి వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక సహకారం అందిస్తూ వారి సాధికారతకు కృషి చేస్తోంది. ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న బ్యాంక్ రుణాలను పూర్తిగా మాఫీ చేసిన ప్రభుత్వం క్రమం తప్పకుండా వారికి ప్రతి ఏటా ఆ మొత్తాన్ని విడతలు వారీగా మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణం మొత్తాన్ని మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో డ్వాక్రా మహిళలు నీరాజనాలు పలుకుతున్నారు.

రూ.74.82 కోట్ల లబ్ధి

ఏలూరు నియోజకవర్గంలో నాలుగు విడతల్లో ఆసరా పథకంలో 32,672 మంది డ్వాక్రా మహిళలకు మొత్తం రూ.74,82,58,231 మేరకు లబ్ధి చేకూరింది. ఈ ఆసరా పథకంలో ఒక్కో మహిళలకు ఒక్కో విడతలో సగటున రూ.9,500 సాయం అందింది. దీంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వెంకటాపురం పరిధిలో సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫాటో)

ఏలూరు నియోజకవర్గంలోని వివరాలు ఇలా..

ఇళ్లు	: 88,366
రేషన్ కార్డులు	: 66,076
క్లస్టర్లు	: 1484
వలంటీర్లు	: 1434
డివిజన్లు	: 50
సచివాలయాలు	: 79

మాట నిలబెట్టుకున్న జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ సొమ్మును ఆసరా పథకం పేరుతో క్రమం తప్పకుండా జమ చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలు ఆసరా పథకంలో సొమ్ము అందించారు. ఆసరా సొమ్ము మాకు ఎంతో అక్కరకు రావడం సంతోషదాయకం. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– కొమ్మూరి అరుణ, డ్వాక్రా మహిళ, ఏకేజీ సెంటర్, 43వ డివిజన్

ప్రభుత్వ సహకారం మరువలేనిది



ఎన్నికల ముందు తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకుంటున్నారు. మహిళలకు సీఎం జగన్ అందిస్తున్న సహకారం మరువలేనిది. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఆసరా, అమ్మఒడి, సున్నా వడ్డీ పథకాల ద్వారా అందిస్తున్న చేయూతతో ఆర్థిక పరిపుష్టి సాధించగలుగుతున్నాం. జగన్‌కు కృతజ్ఞతలు.

– మణ్యం జ్యోతి, డ్వాక్రా మహిళ, కునిశెట్టివారి వీధి, 43వ డివిజన్

బాలబాలికలకు పోషకాహారం పంపిణీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న ఆర్‌బీఎస్‌కే సెంటర్‌లో 25 మంది హెచ్ఐవీ బాధిత బాలబాలికలకు మానవత ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో శనివారం పోషకాహారం అందజేశారు. మానవత రీజియన్ చైర్మన్ పోలవరపు దేవరత్నాకరరావు, మానవత అడ్వైజరీ బోర్డ్ కమిటీ సభ్యులు నాగులపల్లి సీతామహాలక్ష్మి ఆర్థిక సాయంతో పోలవరపు ధర్మరాజు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అందె మునలయ్య, పఠాన్ హుస్సేన్ ఖాన్, షేక్ షబ్బీరున్నీషా ఆర్థిక సాయంతో నెలకు సరిపడా పోషకాహారం, నందిగం దివ్యశ్రీ సాయంతో భోజనాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ యూవీఎన్ శాస్త్రి, ప్రభుత్వ బోధనాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బంకా రవి కుమార్, ఆర్ఎంఓ ప్రసాద్ రెడ్డి, మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షులు మేతర అజయ్ బాబు, దేవినేని భాస్కరరావు, మేడికొండ పద్మజ, ఆర్ కన్నయ్య, ఎ.బలరామ్, డొమినిక్, నందిగం ఉదయ కృష్ణ, శివరామకృష్ణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు పోషకాహారం అందిస్తున్న మానవత సభ్యులు

వికలాంగులకు పెన్షన్ రూ.6 వేలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వికలాంగులకు పెన్షన్ నెలకు రూ.6 వేలకు పెంచాలని, ఉచిత బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఇంటి స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఏలూరు జిల్లా సమావేశం కోరింది. సంఘం ఏలూరు జిల్లా సమావేశం స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో అల్లాడి నటరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ వికలాంగులు వారి పనులు వారు చేసుకోలేక ఇతరులపై ఆధారపడే పరిస్థితిలో అవయవలోపంతో ఉన్నవారికి పెన్షన్ రెండింతలు పెంచి ఇవ్వాలని కోరారు. నటరాజు మాట్లాడుతూ వికలాంగులకు విద్య, ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ప్రభుత్వమే పూర్తి సబ్సిడీతో స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అంత్యోదయ కార్డులిచ్చి నెలకు 35 కేజీల బియ్యం, స్వయం ఉపాధికి రూ.5 లక్షలు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగుల సమస్యలపై ఈ నెల 18న ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా బొర్రా పాండు రంగారావు జిల్లా కన్వీనర్‌గా ఐదుగురితో తాత్కాలిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో వలివేటి హేమలత, జంపన మునియ్య, ఈపిచర్ల నాగరాజు, ఇళ్ల నరసింహామూర్తి, టి.పుష్పావతి, బి.హేమ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అల్లాడి నటరాజు

రైతులను ఆదుకునేందుకు చర్యలు

ఏలూరు రూరల్ : తుపాను బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ అధికారులతో వరి పంట నష్టంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నష్టపోయిన రైతులకు కొద్దిరోజుల్లోనే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వీఆర్వో, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ప్రతి రైతు వద్దకూ వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి జీవనసంధ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహించిన తహసీల్దార్ సోమశేఖర్

ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గం విముక్తి కోసం ఏఐటీయూసీ 104 ఏళ్ల క్రితం ఏర్పడిందని, స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిందని వివరించారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారి వర్గానికి అనుకూలంగా మోదీ విధానాలు అమలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం సిగ్గు చేటన్నారు. మోదీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, తొర్లపాటి బాబు తదితరులు మాట్లాడారు. ఏలూరు జిల్లా కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ఆవిష్కరించారు. మహాసభలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు ఈ ఏడాదిని పారదర్శకతలో పాలుపంచుకోండి అనే నినాదంతో అవినీతి నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ ఫణికుమార్, మేనేజ్‌మెంట్ హెచ్ఓడీ పి.అరుణ జ్యోతి, ఇంగ్లిష్ హెచ్ఓడీ ఎం.ఇమ్మానియేలు, లైబ్రేరియన్ పి.వీరభద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక గీతా భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు దంపతులు ప్రారంభించారు. శిబిరంలో ఆయుర్వేద వైద్యాధికారి బీవీఎం నగేష్ బృందం 128 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు అక్కినేని వెంకటేశ్వరరావు, వి.రత్నకుమార్, బొలిశెట్టి సురేష్, వేమా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించండి

పెదపాడు: మాసూళ్లు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని రైతు భరోసా కేంద్రాన్ని ఆర్డీవో శనివారం పరిశీలించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, వీఆర్వోలు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, రవికుమార్, బీ కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



సీతామహాలక్ష్మికి రూ.లక్ష బీమా చెక్కును అందజేస్తున్న కట్టా ఏసుబాబు, వలంటీర్ రమాదేవి

దెందులూరు: వైఎస్సార్ జగనన్న కాలనీలో యండమూరి నాగవెంకట విజయ్ ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందారు. అతని భార్య సీతామహాలక్ష్మికి శనివారం మంజూరైన వైఎస్సార్ బీమా రూ.లక్ష చెక్కును వలంటీర్ రమాదేవి మండల సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, 11వ వార్డు మెంబర్ కట్టా దుర్గాంబ, బీ. పద్మావతి అందజేశారు.

మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం కొంటాం

దెందులూరు: తుపాను కారణంగా వరి మొలకెత్తినా, రంగు మారిన ఖచ్చితంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ మేరకు ముఖ్యమంత్రి నేరుగా ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం మండలంలో సానిగూడెం, కొవ్వలి గ్రామాల్లో నీటమునిగిన వరి పొలాలను, పనలను పరిశీలించారు. బాధిత రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొవ్వలి, సానిగూడెం గ్రామాల్లో మాట్లాడుతూ రైతులు తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టాలన్నారు. పంట నష్టాన్ని పూర్తి స్థాయిలో నమోదు చేయాలని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య గ్రామాల్లోని వీఆర్వోలను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదని, రైతు సంక్షేమ ప్రభుత్వంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర నుంచి నేటి వరకు ఉన్నారని అన్నారు. వీఆర్వోలు రైతుల సమస్యలకు సంబంధించి అందుబాటులో సకాలంలో సేవలు అందించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో ఎన్ని వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. దాదాపు 4,453 ఎకరాలు తుపాను కారణంగా నష్టం జరిగిందని ఆయన సమాధానమిచ్చారు. వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. దుర్గారావు, తహసీల్దార్ ఏవీ నాంచారయ్య, ఏఓ గద్దె రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సానిగూడెం, కొవ్వలి సర్పంచులు శనిపల్లి రామకృష్ణ (విష్ణు), హేమలత, నాయకులు నాగభూషణం, గొల్లా వీరాస్వామి తదితరులున్నారు.



తడిచిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

సబ్సిడీపై పెసర, మినుము విత్తనాల పంపిణీ

పెదపాడు: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో శనివారం ఇటీవల తుపాను కారణంగా పంట నీట మునిగి పాడైన రైతులకు సత్యవోలు రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై అపరాల విత్తనాలు పంపిణీ చేసారు. ఎకరానికి 8 కేజీల చొప్పున అందిస్తారని మండలంలో 275 క్వింటాళ్ల అపరాల విత్తనాలు సబ్సిడీలో అందించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. ఇందులో భాగంగానే పెసర మినుము విత్తనాలు ముందుగా అందజేస్తున్నామన్నారు. పంట నష్టాన్ని అధికారులు నమోదు చేస్తున్నారని త్వరలోనే ప్రభుత్వం నుంచి రైతులకు పరిహారం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవోలు సర్పంచ్ రంభా ఉమామహేశ్వరి, ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.



సత్యవోలులో పెసర, మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

అంగన్‌వాడీ కేంద్రం పనితీరు భేష్



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సెంట్రల్ టీమ్

ఏలూరు (టూటౌన్): తంగెళ్లమూడి ద్వారకానగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సెంట్రల్ టీమ్ సభ్యులు శనివారం సందర్శించారు. కేంద్రం నిర్వహణ, పనితీరును పరిశీలించి అభినందించారు. సెంటర్ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటాన్ని మెచ్చుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. సెంట్రల్ టీమ్ సభ్యులు, ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓలు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ అవాస్తవం

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ నేతలు చెరువు భూమి ఆక్రమించారంటూ టీడీపీ నేతలు చేస్తోన్న ప్రచారంలో వాస్తవం లేదని మాదేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు రూరల్ మండల గ్రామాలైన శ్రీపర్రు, గురుకులపేట పరిసరాల్లో మత్స్యశాఖకు చెందిన ఆరు ఎకరాల చెరువు ఉందని వివరించారు. 2014 నుంచి నేటి వరకు పంచాయతీ అధికారులు ఈ చెరువును శ్రీపర్రు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమీపిస్తున్నందున టీడీపీ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు చెరువును వైఎస్సార్ సీపీ నాయకులు ఆక్రమించారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ, గ్రామాల్లో అలజడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. మాదేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఈ చెరువు మాదేపల్లి దళిత మత్స్యకారుల సొసైటీకి చెందుతుందని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి హామీ ఇచ్చారని వివరించారు. స్వలాభం కోసం ప్రజల మధ్య అగాధం, అపోహలు సృష్టిస్తున్న టీడీపీ నాయకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న బ్రాహ్మణ కార్తీక సమారాధన నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు మైలవరపు బాల సుబ్రహ్మణ్య శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో ఉదయం 6.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, ఉసిరిచెట్టుకు పూజ, దీపారాధన, 6.45 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8.30 గంటలకు అల్పాహారం అనంతరం విష్ణు, లలితా సహస్రనామ పారాయణ, 9 గంటలకు సంఘ మహాజన సభ ఉంటుందని తెలిపారు. ఉదయం 11 గంటలకు సంఘం 40వ వార్షికోత్సవం సందర్భంగా బ్రాహ్మణ ప్రముఖులను సన్మానిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 35 కేసులకు పరిష్కారం



ప్రభాకర్, సీఐ

ఏలూరు : లోక్ అదాలత్‌లో కక్షిదారుల అంగీకారం మేరకు టూటౌన్ పరిధిలో 35 కేసులు పరిష్కరించినట్టు ఏలూరు టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్ తెలిపారు. ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా నడచుకోవటంతోపాటు, వారికి న్యాయం చేయటానికి కృషిచేస్తున్నట్టు చెప్పారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో నేరాల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.15	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	04
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	05
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	29
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	58	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	50	కంద	60
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	50
కాకర కాయలు	40-48	కీరా దోస	36
బీరకాయలు	54	ఫ్రెంచ్‌బీన్స్	78
బీరకాయలు (పందిరి)	64	అల్లం	120
క్యాబేజీ	26	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	58	పాలకూర	12
దొండకాయలు	44	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	50-55	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24-38	బఠాణీ	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	89
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	28